క్లుప్తంగా

పరామర్శ



ఉదయగిరి: ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని మర్రిపాడులోని నివాసంలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి సోమవారం కలుసుకుని పరామర్శించారు. ఇటీవల గుండెపోటుకు గురై చెన్నైలో శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యేను కలిసి పరామర్శించారు.

వెంగమాంబకు రూ.11.06 లక్షల రాబడి



దుత్తలూరు: మండలంలోని నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలు ఆలయ హుండీల్లోని కానుకలను ఆలయ ఈఓ ఉషశ్రీ, వ్యవస్థాపక ధర్మకర్త వేమూరి మునలయ్య ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. గతేడాది నవంబరు 30 నుంచి సోమవారం వరకు భక్తులు సమర్పించిన నగదు కానుకలను లెక్కించగా రూ.11,06,255 ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్ కృష్ణచైతన్య, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ సర్వే వేగవంతం చేయాలి



అల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ శ్రీదేవి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలుపై సిబ్బందికి సూచనలు చేశారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు



కలిగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ గీతారెడ్డి కోరారు. మండలంలోని కృష్ణారెడ్డిపాళెం గ్రామ సచివాలయంలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ సేవలను సోమవారం అందజేశారు. సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యసిబ్బంది ప్రసాద్, సంధ్య, మమత, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



దుత్తలూరు: పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జేఎస్సార్ ఫౌండేషన్ ప్రతినిధి దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు జేఎస్సార్ ఫౌండేషన్ తరఫున సోమవారం పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తామని తెలిపారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సులోచన మాట్లాడుతూ విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేసిన జేఎస్సార్ ఫౌండేషన్ అధినేత జయసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు ప్రారంభం



సంగం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు, డీసీఓ తిరుపాల్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో తొలి పెట్రోల్ బంకును సంగంలో ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలో మరిన్ని సొసైటీల్లో పెట్రోల్ బంకులు ప్రారంభించనున్నట్లు వివరించారు. సొసైటీలో రైతులకు అన్ని వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఈఓ శంకర్‌బాబు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ముమ్మర ఏర్పాట్లు



ఆత్మకూరు: మాట్లాడుతున్న ఆర్డీఓ కరుణకుమారి



సోమశిల: రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన తహసీల్దార్ వెంకటరమణారావు

ఆత్మకూరు: తూర్పురాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ఆత్మకూరు డివిజన్ పరిధిలో సజావుగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీఓ సాధు కరుణకుమారి తెలిపారు. సోమవారం ఆర్డీఓ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో పట్టభద్రులకు సంబంధించి ఏడు పోలింగ్ కేంద్రాలు ఉండగా, మరో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరామని తెలిపారు. ఉపాధ్యాయులకు సంబంధించి మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే మండల రెవెన్యూ అధికారులు, పోలీసులు పరిశీలించారని తెలిపారు. తాను పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లపై సూచనలు చేయడం జరిగిందన్నారు. త్వరలో అన్ని పోలింగ్ కేంద్రాలను అధికారులతో కలిసి మరోసారి పరిశీలించనున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని చెప్పారు. ఎన్నికల కోడ్‌ను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

మర్రిపాడు: ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ హేమంత్‌కుమార్ కోరారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ర్యాలీలకు అనుమతి లేదని సూచించారు. పోలింగ్ కేంద్రాల వివరాలను వివరించారు. ఓటర్ల జాబితాలను ప్రదర్శించి ఏమైనా తప్పొప్పులు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు.

అనుమసముద్రంపేట: ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఏఎస్‌పేట తహసీల్దార్ సుభద్రమ్మ కోరారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ప్రతిఒక్కరూ నిబంధనలను పాటించాలని కోరారు.

సోమశిల: ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ అన్నదాత వెంకటరమణరావు కోరారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ ల నాయకులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌కు సంబంధించి సూచనలు చేశారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, సడ్డా రవీంద్రారెడ్డి, మంగలి పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

సోమశిల: గృహసారథులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మంచిపేరు తీసుకురావాలని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, మండల సచివాలయాల కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, పేర్కొన్నారు. సోమశిల, మంచాలపల్లి గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను సోమవారం వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహసారథులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్యన వారధిలా నిలిచి రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు బాటలు వేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బత్రెడ్డి పోలిరెడ్డి, గుండుబోయిన వెంకటరమణ, ముక్కు మస్తాన్, గుండుబోయిన ఈశ్వరయ్య, పెంచలరెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

పాఠశాలలోని ఇన్వర్టర్ బ్యాటరీల చోరీ

కావలి రూరల్ : పట్టణంలోని వెంగళరావునగర్‌లోని శ్రీ పొట్టిశ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. పాఠశాలలోని ఇన్వర్టర్‌కు సంబంధించిన 20 బ్యాటరీలను అపహరించుకెళ్లారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు.. వెంగళరావు నగర్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలోకి ఆదివారం రాత్రి దొంగలు ప్రవేశించారు. కంప్యూటర్ గది తాళాలను పగులగొట్టి అందులోని సుమారు రూ.2 లక్షల విలువైన 20 ఇన్వర్టర్ బ్యాటరీలను అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు కంప్యూటర్ గది తాళం పగులగొట్టి ఉండడాన్ని గుర్తించి ఉపాధ్యాయులకు సమాచారం అందజేశారు. ఉపాధ్యాయులు కంప్యూటర్ గదిలోకి వెళ్లి పరిశీలించగా ఇన్వర్టర్ బ్యాటరీలు కనిపించలేదు. దీంతో రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా గతంలోనూ వెంగళరావునగర్ ఉన్నత పాఠశాలలో పలుమార్లు దొంగతనాలు జరిగాయి. గతంలో 8 ఇన్వర్టర్ బ్యాటరీలు, ప్రొజెక్టర్, నీటి కుళాయిలు చోరీకి గురయ్యాయి. ఆ సమయంలో మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా మొక్కుబడిగా రెండు రోజులు వాచ్‌మన్‌ను నియమించారు. ఆ తరువాత పాఠశాల భద్రతను గాలికొదిలేశారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి శాశ్వతంగా వాచ్‌మన్‌ను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

ఎద్దుల బీడు అక్రమ విక్రయంపై ఫిర్యాదు



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కొండాపురం: భీమవరప్పాడలోని ఎడ్ల బీడును అక్రమంగా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ చాగంటి కృష్ణ కోరారు. ఈ మేరకు మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరరావుకు సోమవారం ఆయన గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనంబర్ 151లో 86.66 ఎకరాల భూమి ఉందని తెలిపారు. గ్రామంలోని కొందరికి మాత్రమే చెందిన ఎడ్ల బీడును ఇటీవల గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా కొత్త సర్వేనంబర్లు సృష్టించి ఇతరులకు విక్రయించారని ఆరోపించారు. రెవెన్యూ అధికారుల సహకారంతోనే అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుని నిజమైన పట్టాదారులకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన డీటీ మాట్లాడుతూ తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఉద్యాన పంటలకు ప్రభుత్వం ప్రోత్సాహం



ఆయిల్‌పామ్ సాగును పరిశీలిస్తున్న ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు

ఆత్మకూరురూరల్: ఉద్యాన పంటలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తోందని ఆత్మకూరు ఉద్యానశాఖ అధికారి రాజశేఖరరెడ్డి తెలిపారు. మండలంలోని బండారుపల్లిలో సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబుతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు ఒక్కో ఎకరాకు 57 మొక్కలు నాటేందుకు రూ.11 వేలు అందజేస్తుందని తెలిపారు. ఎరువులకు రూ.2,100, అంతర్ పంటల సాగుకు మరో రూ.2100 వంతున అందజేస్తుందన్నారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లో ప్రస్తుతం 75 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపడుతున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు ఉద్యానశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. మురగళ్ల వీఏఏ స్వప్న, స్థానిక రైతులు బొమ్మిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కుక్కపల్లి నాగేశ్వరరావు, బొమ్మిరెడ్డి హేమంత్, అల్లారెడ్డి శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలికా సంరక్షణకు పెద్దపీట



కావలిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాలల సంరక్షణాధికారి సురేష్

బిట్రగుంట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికా సంరక్షణకు పెద్దపీట వేస్తూ ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ పేర్కొన్నారు. కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 'బేటీ బచావో..బేటీ పడావో' పేరుతో బాలికా సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల సంరక్షణతో పాటు వారి ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. బాల్యవివాహాల నియంత్రణ, పోక్సో, బాలికల అక్రమ రవాణా నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కావలి రూరల్: ప్రస్తుత సమాజంలో మహిళలు అన్నీ రంగాల్లో రాణిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని బాలికలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా బాలల సంరక్షణాధికారి బీ సురేష్ అన్నారు. ముసునూరులోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం బాలికల సంరక్షణకు అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కామాక్షీదేవి ఉత్సవాలు

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమనలో కొలువైన కామాక్షీదేవి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి మూడ్రోజుల పాటు శ్రీచక్రచర ప్రతిష్ట ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సురేష్‌స్వామి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో కామాక్షీదేవికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

చౌకదుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

బిట్రగుంట: బోగోలులోని నాలుగో నంబరు చౌకదుకాణంలో విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది రికార్డులను తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. చౌకదుకాణం పరిధిలోని 380 కుటుంబాలకు గానూ 215 కుటుంబాలకు బియ్యం పంపిణీ చేసినట్లు గుర్తించారు. మిగిలిన కుటుంబాలకు సంబంధించిన 1800 కేజీల బియ్యం స్టాక్ ఉండాల్సి ఉండగా ఆ మేరకు నిల్వలు లేకపోవడంతో చౌకదుకాణం నిర్వాహకుడిపై 6ఏ కింద కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో మైనింగ్ ఏజీ సుబ్బయ్య, ఆర్ఐ శ్రీధర్, వీఆర్వో కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

భూములు తిరిగి ఇప్పించాలని వినతి

బిట్రగుంట: బోగోలులోని గంగతిప్ప ప్రాంతంలోని తమకు కేటాయించిన భూముల్లో అధికారులు అక్రమంగా మంజూరు చేసిన మైనింగ్ అనుమతులను రద్దు చేయించి, తిరిగి తమకే భూములు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కోరారు. సోమవారం వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మద్దిబోయిన వీరరఘు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో ఎస్సీలకు మంజూరు చేసిన పట్టాలను రద్దు చేయకుండానే అధికారులు ఏకపక్షంగా ఇతరులకు మైనింగ్ అనుమతులు మంజూరు చేశారని ఎమ్మెల్యేకు వివరించారు. భూములపై పూర్తి స్థాయిలో విచారణ చేయించి మైనింగ్ అనుమతులు రద్దు చేయించాలని, భూములను లబ్ధిదారులకు తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

గృహనిర్మాణాలకు జియో ట్యాగింగ్



సంగం: ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం అందించడంతో పాటు గృహ నిర్మాణాలకు ఆర్థిక సహకారం అందిస్తున్నందున సొంతింటి కలను ప్రతిఒక్కరూ సాకారం చేసుకోవాలని హౌసింగ్ ఏఈ కరిముల్లా అన్నారు. సంగంలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు, గృహాలు పొందిన 300 మందికి పైగా లబ్ధిదారులకు సోమవారం జియో ట్యాగింగ్ చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మెట్టుకూరు వాసుదేవరెడ్డి, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

20న పాటల పోటీలు

అల్లూరు: స్థానిక రామకృష్ణ జూనియర్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 20న పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. మేడా సురేఖ స్మారకంగా అల్లూరు, కొడవలూరు, విడవలూరు, బోగోలు, దగదర్తి మండలాల్లోని 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు మాత్రమే పోటీకి అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు 99895 98824 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పారిశ్రామికాభివృద్ధికి చొరవ చూపండి

- ఏపీఐఐసీ ఎండీకి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి వినతి



ఏపీఐఐసీ ఎండీ సృజనతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: మెట్టప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధికి చొరవచూపాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఏపీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ గుమ్మల సృజనను కోరారు. సోమవారం ఆయన అమరావతిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో ఎండీను కలిసి పారిశ్రామికాభివృద్ధికి సంబంధించిన ఫైల్‌ను అందజేశారు. తన సోదరుడు, దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి ఎంఎస్‌ఎంఈ పార్కును నెల్లూరు–ముంబయి జాతీయ రహదారి పక్కన 78 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేశారని తెలిపారు. మరో 83 ఎకరాల స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్లు సైతం పూర్తయి సిద్ధంగా ఉందన్నారు. తొలిఫేజ్‌లో ఎంఎస్‌ఎంఈ పార్కులో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తయిందన్నారు. అప్పట్లో ప్లాస్టిక్ వస్తువుల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని ప్రకటించారన్నారు. పార్కులో భూమి లీజు అధికంగా ఉందన్న కారణంతో చిన్నతరహా పారిశ్రామికవేత్తలు వెనుకంజ వేస్తున్నారని ఎండీ దృష్టికి తీసుకొచ్చారు. వారికి కొంత వెసులుబాటు కల్పిస్తే పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తారని తెలిపారు. తొలుత వచ్చే వారికి 25 శాతం ప్లాట్లకు మార్కెట్ ధరలో 50 శాతం రాయితీ కల్పిస్తే పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతారని వివరించారు. దీంతో పారిశ్రామికాభివృద్ధికి వెసులుబాటు కలుగుతుందని విన్నవించారు. స్పందించిన ఎండీ సృజన పారిశ్రామికాభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

పరీక్షలపై భయాన్ని వీడాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విజయచంద్ర

కావలి : పదోతరగతి విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడాలని పల్లిపాడు ప్రభుత్వ డైట్ కళాశాల ఉపన్యాసకుడు కే విజయచంద్ర తెలిపారు. మండలంలోని ఒట్టూరు ఆదర్శ పాఠశాలలో పరీక్షా పర్వ్ 4.0 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యా విభాగాలు, బాలల హక్కుల సంఘాలు సంయుక్తంగా విద్యార్థుల్లో పరీక్షలపై భయాన్ని పోగొట్టేందుకు ఈనెల 11వ తేది నుంచి 20వ తేది వరకు పరీక్షా పర్వ్ 4.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురై భయంతో పరీక్షలను సరిగా రాయలేకపోతున్నారన్నారు. ఒత్తిడిని జయించి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇందిర, అధ్యాపకులు శ్రీహరి, శివకుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

సోమశిల: అనంతసాగరం మండలం ఉప్పలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఎంఈఓ బాలకృష్ణారెడ్డి సమగ్ర శిక్ష ఇంజినీర్ శ్రావణ్‌కుమార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఫీల్డ్‌ఇంజినీర్ సైపుల్లా, ప్రధానోపాధ్యాయుడు అబ్బాస్‌అలీ, పాఠశాల సిబ్బంది ఉన్నారు,

ఆహార ఉత్పత్తుల తయారీపై శిక్షణ

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో వైకేపీ ఆధ్వర్యంలో పాడుపు మహిళలకు ప్రధానమంత్రి సూక్ష్మఆహార ఉత్పత్తుల అభివృద్ధి పథకంపై సోమవారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సూక్ష్మ ఆహార ఉత్పత్తుల ఎస్పార్పీ మధుసూదన్‌రావు, డీఆర్పీ వెంకట్ మాట్లాడుతూ మండలంలోని 43 మంది పాడుపు మహిళలకు సూక్ష్మఆహార ఉత్పత్తుల తయారీకి స్త్రీనిధి ద్వారా రూ.40 వేలు చొప్పున అందజేసినట్లు తెలిపారు. యంత్రాల ద్వారా ఆహార ఉత్పత్తులు తయారీ యూనిట్ ధర రూ.లక్ష పైన ఉంటే కేంద్ర ప్రభుత్వం 30శాతం సబ్సిడీ ఇస్తుందని వివరించారు. ఏపీఎం ఖాజారహ్మతుల్లా, పాడుపు మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల ప్రారంభం

సీతారామపురం: ప్రముఖ శైవక్షేత్రమైన ఘటిక సిద్దేశ్వరం రోడ్డు మరమ్మతు పనులను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి సోమవారం ప్రారంభించారు. మహాశివరాత్రి సందర్భంగా క్షేత్రానికి వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. వైస్ ఎంపీపీ బసిరెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షు డు చప్పిడి తిరుపతిరెడ్డి, మండల సచివాలయాల కన్వీనరు బాలినేని మాబయ్య, దేవమ్మచెరువు ఉపసర్పంచ్ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

12 బాటిళ్ల మద్యం పట్టివేత

మర్రిపాడు: మండలంలోని కృష్ణాపురంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో ఉదయగిరి సెబ్ సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఉమ్మాయపల్లికి చెందిన పువ్వకట్ల నాగరాజు వద్ద 12 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. గ్రామంలో అక్రమంగా విక్రయించేందుకు కృష్ణాపురం నుంచి మద్యాన్ని తీసుకెళ్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఉదయగిరి సెబ్ ఎస్సై మురళీకృష్ణ తెలిపారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు చిత్తు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఖాజావలి

కొండాపురం : మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై షేక్ ఖాజావలి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నియంత్రణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. వ్యసనాలకు బానిసైతే కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. సమాజంలో గౌరవాన్ని కోల్పోతారని తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాలను విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా తమకు సమాచారం అందజేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం శ్రీహరి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అల్లూరు: అల్లూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని సూపరింటెండెంట్ కే వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆస్పత్రిలో వైద్యసిబ్బందిని నియమించి, మౌలిక సదుపాయాలు కల్పించడంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. గతంతో పోలిస్తే ఓపీ సంఖ్య పెరిగిందని తెలిపారు. గతంలో రోజుకు 30 మంది వస్తుండగా, ప్రస్తుతం 250 మంది వరకు వైద్యసేవలు పొందుతున్నారని వివరించారు. నెలకు 15 నుంచి 20 వరకు డెలివరీలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెలలో ఇప్పటి వరకు 17 డెలివరీలు చేయడం జరిగిందన్నారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర

చేజర్ల: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర అందిస్తున్నట్లు సివిల్ సప్లయిస్ డీటీ రవి తెలిపారు. మండలంలోని పాతపాడు, మాముడూరు ఆర్‌బీకేల పరిధిలోని రైతులకు కొనుగోలు కేంద్రాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటా ధాన్యానికి ఏ–గ్రేడుకు రూ2060, సాధారణ రకానికి రూ.2040 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. మిల్లర్లతో సంబంధం లేకుండా నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వివరించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధరను పొందాలని కోరారు. ఏఓ శశిధర్, వీఆర్వో మురళి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.